వెలవెలబోతున్న ల్యాబ్



ల్యాబ్ టెక్నీషియన్ లేక వెలవెలబోతున్న ల్యాబ్

కేశంపేట: వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పుల కారణంగా వివిధ రకాల రోగాలతో ప్రజలు మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వస్తున్నారు. ప్రస్తుతం సుమారుగా 90 మంది ఓపీ వస్తుంది. గతంలో ఓపీ సుమారుగా 60 వరకు వచ్చేదని వైద్య సిబ్బంది తెలిపారు. పీహెచ్‌సీలో ల్యాబ్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహించాల్సిన శకుంతల డిప్యూటేషన్‌పై హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో గల డయాగ్నోస్టిక్ సెంటర్‌కు వెళ్లారు. అప్పటి నుంచి ఇక్కడ ల్యాబ్ టెక్నీషియన్ లేకపోడవంతో కొందుర్గు, నందిగామ పీహెచ్‌సీల నుంచి ల్యాబ్ సిబ్బంది వారంలో ఒక్క రోజు చొప్పున వస్తున్నారు. అయినప్పటికీ రోగులకు పరీక్షలు చేయించుకోవడానికి ఇబ్బందులు తప్పడం లేదు.

46 జీపీలకు.. ఒకటే పీహెచ్‌సీ



కొందుర్గు పీహెచ్‌సీలో మందులు తీసుకుంటున్న రోగులు

కొందుర్గు: కొందుర్గు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సరిపడా మందులు ఉండవు. సిబ్బంది కొరత వేధిస్తూనే ఉంది. కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ రెండు మండలాలకు కలిసి ఒకే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కొందుర్గులో ఉంది. 46 గ్రామ పంచాయతీలు, 75 వేల జనాభా ఉన్నా ఒకటే పీహెచ్‌సీ ఉండటంతో రోగులకు సరైన సేవలు అందడం లేదు. దానికితోడు 24 గంటల ఆస్పత్రి అయినప్పటికీ సిబ్బంది కొరతతో ఇబ్బందులు తప్పడం లేదు. ఇక్కడ ఇద్దరు డాక్టర్లు ఉన్నా ఒక డాక్టర్ ఏడాది క్రితం షాబాద్ పీహెచ్‌సీకి డిప్యూటేషన్‌పై పంపించారు. ఇక ఒక డాక్టర్ జోసెఫ్ మాత్రమే పగటి వేళల్లో ఉంటుంది. రాత్రి సమయంలో డాక్టర్ ఎవరూ అందుబాటులో ఉండరు. ఇద్దరు స్టాఫ్ నర్సులు ఉండాల్సిన ఆస్పత్రిలో ఒక్కరూ కూడ లేకపోవడం బాధాకరం. గ్రామాల్లో పనిచేసే ఏఎన్‌ఎంలతో స్టాఫ్‌నర్సులుగా సేవలు తీసుకుంటున్నారు.

ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ పరీక్షలు బయటనే

కొత్తూరు: మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు సరైన సేవలు అందడం లేదు. దశల వారీగా ఆస్పత్రి అభివృద్ధి చెందుతున్నప్పటికీ సేవల్లో మాత్రం మార్పు లేదు. కేవలం రక్త, మూత్ర, తదితర పరీక్షలే ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయి. మందులు అందుబాటులో ఉన్నాయి. ఆస్పత్రికి ప్రతిరోజు 50 నుంచి 60 మంది రోగులు వస్తున్నారు.

నిత్యం 80 మంది రోగులు



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ స్రవంతి

నందిగామ: మండల కేంద్రమైన నందిగామలోని పీహెచ్‌సీలో నిత్యం సుమారు 70 నుంచి 80 మంది రోగులు వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారని డాక్టర్ స్రవంతి తెలిపారు. సాక్షి విజిట్‌లో భాగంగా సోమవారం పీహెచ్‌సీని సందర్శించగా వైద్యులు అందుబాటులో ఉండి రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. కావాల్సిన మందులు అందుబాటులో ఉన్నాయని, ఎక్కువగా జ్వరం, జలుబు కేసులు వస్తున్నాయని పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులతో పరుగులు



మొయినాబాద్ పీహెచ్‌సీలో మందులు తీసుకుంటున్న రోగులు

మొయినాబాద్: సీజనల్ వ్యాధులతో మున్సిపల్‌లోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సోమవారం జలుబు, జ్వరం, విరేచనాలు, కాళ్ల నొప్పులకు సంబంధించిన రోగులు ఆస్పత్రికి వచ్చారు. వైద్యాధికారి అన్నపూర్ణ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రోజుకు వంద మందికి పైగా రోగులు ఆస్పత్రికి వచ్చి పరీక్షలు చేయించుకుంటున్నారు. మందులు ఉన్నాయి. ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ స్కానింగ్ అందుబాటులో లేదు.

దగ్గు.. జలుబు.. జ్వరం

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగుల క్యూ
- సేవలు అందక విలవిల
- సమయపాలన పాటించని వైద్యులు
- వేధిస్తున్న సీజనల్ వ్యాధులు

ప్రస్తుతం చోటు చేసుకుంటున్న వాతావరణ మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులతో ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో క్యూ కడుతున్నారు. ఈ మేరకు సోమవారం సర్కారు దవాఖానాల్లో 'సాక్షి' విజిట్ నిర్వహించగా పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. జ్వరం, జలుబు, విరేచనాలతో సర్కారు దవాఖానాకు వస్తున్న రోగులకు పడిగాపులు తప్పడం లేదు. సమయపాలన పాటించని వైద్యుల కోసం గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. వాటికి తోడు సౌకర్యాల లేమి, అక్కడక్కడ మందుల కొరత ఉంది. ల్యాబ్ సౌకర్యాలు అందుబాటులో లేవు.



చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య కోసం వచ్చిన ప్రజలు

అరకొర వసతులు

చేవెళ్ల: వాతావరణ మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులతో రోగులు ప్రభుత్వ ఆస్పత్రులకు క్యూకడుతున్నారు. సోమవారం చేవెళ్ల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని సాక్షి విజిట్ చేయగా.. సీజనల్ వ్యాధులు జలుబు, దగ్గు, జ్వరాలతో రోగులు వచ్చారు. ప్రతిరోజు దాదాపు 180 నుంచి 250 వరకు ఓపీ పెషెంట్లు వైద్య కోసం ఆస్పత్రికి వస్తున్నారని వైద్యులు తెలిపారు. ఇరుకు గదుల్లో వైద్యులు ఉండటంతో రోగులు వచ్చి క్యూలైన్‌లో నిలబడేందుకు కూడా ఇబ్బందిగా మారుతోంది. ఆస్పత్రి భవనం సరిపడకపోవటంతో ఉన్నదాంట్లోనే అన్ని విభాగాలుగా ఏర్పాటు చేసి వాడుతున్నారు. మొత్తం 10 మంది వైద్యులు ఉన్నప్పటికీ ఇందులో ఇద్దరు డిప్యూటేషన్‌పై వేరే ఆస్పత్రికి వెళ్లగా.. మరో ఇద్ద వైద్యులు మెడికల్ లీవ్‌లో ఉన్నారు. ఉన్న ఆరుగురిలో ముగ్గురు సివిల్ సర్జన్ వైద్యులే కావటంతో మిగిలిన ముగ్గురు వైద్యులు రెగ్యులర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఎక్స్‌రే విభాగం అందుబాటులో ఉన్నా టెక్నీషియన్ లేకపోవటంతో అసిస్టెంట్ ఉద్యోగితోనే కొనసాగుతోంది. కావాల్సిన మందులు ఎప్పటికప్పుడూ కావాలని ప్రతిపాదనలు పంపిస్తున్నా పైనుంచి రావటం అలస్యమవుతున్నాయని ఒక్కోసారి వైద్యులే ఇక్కడి వాహనం పంపించి తీసుకొస్తున్నారు. డయాలసిస్ కేంద్రంలో నిత్యం రోగులకు వైద్యం అందిస్తున్నారు.

మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం



ఆస్పత్రిలో ప్రతిరోజు ప్రజలకు మెరుగైన సేవలను అందించేందుకు కృషి చేస్తున్నాం. నిత్యం ఓపీ సంఖ్య కనీసం 200ల మంది వరకు ఉంటుంది. మందులు ఎప్పటికప్పుడూ తెప్పిస్తున్నాం. డయాలసిస్‌కు మంచి ఆదరణ లభిస్తోంది. నిత్యం పేషెంట్లతో నిండి ఉంటుంది. ఉన్నవారితో ప్రజలకు ఇబ్బందులు లేకుండా వైద్యసేవలు అందిస్తున్నాం.

– డాక్టర్ రాజేంద్రప్రసాద్, సూపరింటెండెంట్

ఇద్దరు వైద్యులు ఉన్నా.. సేవలు సున్నా



షాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీ

షాబాద్: పేరుకే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కానీ రోగులకు వైద్య సేవలు అందించండంలో అక్కడి వైద్య సిబ్బంది విఫలమవుతున్నారు. ఉదయం 11 గంటలకు డాక్టర్లు రాకపోవడంతో ఖాళీ కుర్చీ దర్శనమిచ్చింది. రోగులకు స్టాఫ్‌నర్స్ వైద్య సేవలు అందిస్తున్నారు. షాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమయపాలన పాటించని వైద్యులతో రోగులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం 70 నుంచి 80 మందికిపైగా రోగులు వస్తుంటారు. అందులో 50 శాతానికిపైగా సీజనల్ వ్యాధుల బారినపడినవారే. పరీక్షలు చేయించుకోవడానికి ల్యాబ్ సౌకర్యం లేదు. వైద్యులు మాత్రం రక్త నమూనాలను సేకరిస్తున్నారు. కానీ వాటి ఫలితాలు ఎప్పుడు వస్తాయో తెలియని దుస్థితి. దీంతో రోగులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయయించక తప్పడం లేదు. ఇద్దరు వైద్యులు ఉన్నా సేవలు సకాలంలో అందించడం లేదని రోగులు ఆరోపిస్తున్నారు. ఒక ఫార్మాసిస్ట్, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్ విధులు నిర్వహిస్తున్నారు. వైద్య పరికరాలు పూర్తిస్థాయిలో అందుబాటులో లేవు. రోగులకు అన్ని మందులు అందుబాటులో ఉన్నాయి.

క్లుప్తంగా

చేపల చెరువు వేలం రూ.71వేలు

కొందుర్గు: కొందుర్గు శ్రీలక్ష్మీనర్సింహాస్వామి దేవాలయానికి సంబంధించిన చేపల చెరువును సోమవారం ఎండోమెంట్ అధికారులు వేలం వేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ఈసరి లింగం ఒక ఏడాదికి రూ.71వేలకు వేలం పాడి చేపల చెరువును దక్కించుకున్నాడు. లింగం మూడేళ్లపాటు ఏడాదికి రూ.71వేలు చెల్లించి చెరువులో చేపలను పట్టుకోవచ్చని అధికారులు తెలిపారు. అదేవిధంగా చింతచెట్లను వేలం వేయగా ఏడాదికి రూ.11వేలు చెల్లించి మూడళ్ల పాటు వినియోగించుకోవచ్చని అధికారులు నిర్ణయించారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఈఓ శ్రీనివాసశర్మ, దేవాలయ చైర్మన్ కృష్ణయ్య, సభ్యులు వేణుగోపాల్, అశోక్, అర్చకుడు రాజేశ్వరస్వామి, గ్రామస్తులు యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి భరోసా



శ్రీకాంత్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న తోటి స్నేహితులు

కొందుర్గు: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన స్నేహితుడి కుటుంబానికి తోటి మిత్రులు ఆర్థికసాయం అందించి భరోసా కల్పించారు. మండలంలోని ఉమ్మెంత్యాలకు చెందిన శ్రీకాంత్ ప్లంబర్ పని చేసేవాడు. అయితే గత నెలరోజుల క్రితం శ్రీకాంత్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సోమవారం ప్లంబర్ పనిచేసే తోటి స్నేహితులందరూ శ్రీకాంత్ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం కలిపించారు. ఈ సందర్భంగా అందరూ కలిసి రూ.41,500ల ఆర్థిక సాయం అందించారు. అదేవిధంగా 1 క్వింటాల్ బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా స్థానికులు వారిని అభినందించారు.

సివిల్ కోర్టు న్యాయమూర్తిగా విజయ్‌కుమార్

చేవెళ్ల: చేవెళ్ల జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తిగా విజయ్‌కుమార్ ఉపాధ్యాయ్ బాధ్యతలు స్వీకరించారు. చేవెళ్ల కోర్టులో సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయనకు కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాలువా కప్పి స్వాగతం పలికారు. అచ్చంపేట నుంచి బదిలీపై ఆయన చేవెళ్ల జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తిగా వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు నర్సింలు, సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, గీత వనజాక్షి, రవీందర్‌రెడ్డి, మల్లేశ్, ప్రకాశ్, శివరాజ్, రవీందర్, ప్రదీప్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



విజయ్‌కుమార్ ఉపాధ్యాయ్‌కి స్వాగతం తెలుపుతున్న బార్ అసోసియేషన్ సభ్యులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నందిగామ: మండల పరిధిలోని మామిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005–06లో పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు సోమవారం ఈదులపల్లి శివారులోని ఓ ఫామ్‌హౌస్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారందరూ ఒకరికొకరూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఆనందంగా గడిపారు. పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.



సమ్మేళనంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

పేదల సంక్షేమమే లక్ష్యం

కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్

షాబాద్: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని నరెడ్లగూడ, షాబాద్, దామర్లపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు వారు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సహకార సంఘం వైస్ చైర్మన్ మద్దూరు మల్లేశ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీరాంరెడ్డి, నాయకులు ఉన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

కాంగ్రెస్ చేతల ప్రభుత్వమని చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని దామర్లపల్లి గ్రామంలో రూ.5లక్షల రూపాయలతో చేపడుతున్నా సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు ఉన్నారు.



నరెడ్లగూడలో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేస్తున్న నాయకులు

బీజేపీలో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఎంపీ డీకే అరుణ

షాద్‌నగర్: మండల పరిధిలోని కమ్మదనంలో సోమవారం పలువురు నాయకులు ఎంపీ డీకే అరుణ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా గ్రామ బీఆర్‌ఎస్ నాయకులు వెంకటయ్య, కృష్ణ, జాకారం కృష్ణ, కిష్టయ్య తదితరులు పార్టీలో చేరగా.. ఎంపీ వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, శ్రీవర్ధన్‌రెడ్డి, దేపల్లి అశోక్‌గౌడ్, మోహన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

గోల్కొండ బోనాలకు ఆహ్వానం

షాబాద్: ఈ నెల 26వ తేదీన నిర్వహించే గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి బోనాలకు హాజరుకావాలని సోమవారం కుమ్మరి వంశీకులు ఎమ్మెల్యే కాలె యాదయ్యను ఆయన నివాసంలో కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో కుమ్మరి వంశీకులు కుమ్మరి చెన్నయ్య, శంకర్, శ్రీనివాస్, మల్లేశ్, కుమార్, దర్శన్, గిరి, హనుమంతరావు, పాండు, తదితరులు ఉన్నారు.

జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు

షాబాద్: జీవాలకు సీజనల్ వ్యాధులు రాకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. సోమవారం మండల పరిధిలోని లక్ష్మరావుగూడలో జీవాలకు చిటుక వ్యాధి నివారణకు టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది బాల్‌రాజ్, శ్రీనివాస్, కృష్ణమూర్తి, రైతులు, తదితరులు ఉన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాటం

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్



మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్‌ఎఫ్‌ఐ) అలుపెరగని పోరాటం చేస్తోందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ అన్నారు. కేరళలో ఈ నెల 27 నుంచి 30 వరకు నిర్వహించనున్న ఎస్‌ఎఫ్‌ఐ జాతీయ మహాసభల వాల్‌పోస్టర్‌ను పట్టణంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో సోమవారం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. విద్యార్థుల హక్కులు, సామాజిక న్యాయం, ప్రగతిశీల విద్యావిధానాల కోసం ఎస్‌ఎఫ్‌ఐ గత 50 ఏళ్లుగా పోరాడుతోందన్నారు. విద్య అనేది ప్రతి ఒక్కరి హక్కు అని, అన్ని వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులో ఉండాలన్నారు. కుల, మత, ఆర్థిక, వివక్షతను రూపుమాపడానికి విద్యార్థి ఉద్యమాలు ఒక వేదికగా ఉపయోగపడతాయని వివరించారు. సామ్రాజ్యవాదం, దోపిడీ వ్యవస్థలకు వ్యతిరేకంగా పోరాడే అంతర్జాతీయ విద్యార్థి ఉద్యమంగా ఎస్‌ఎఫ్‌ఐ ఆవిర్భవించిందన్నారు. సోషలిస్ట్ ఆలోచనల నుంచి ప్రేరణ పొంది, దోపిడీ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సుమయిర్, కార్యదర్శి శివశంకర్, నాయకులు ఆదిల్, మహ్మద్‌హాజీ, నితిన్‌కుమార్, రాకేశ్, సిద్ధు, జాఫర్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

విడతల వారీగా అభివృద్ధి పనులు

మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య



తాగునీటి పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ లావణ్య, నాయకులు

కొత్తూరు: నిధుల లభ్యతను బట్టి విడతల వారీగా మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్నామని చైర్‌పర్సన్ లావణ్య అన్నారు. ఇందులో భాగంగా సోమవారం ఆమె పలువురు నాయకులతో కలిసి 1వ వార్డులో తాగునీటి పైపులైను పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఇప్పటికే మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో దాదాపుగా సీసీరోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి చేసినట్లు స్పష్టం చేశారు. ప్రస్తుతం పలు వార్డుల్లో పనులు కొనసాగుతున్నాయని వివరించారు. అభివృద్ధి పనులకు ప్రజలు, వ్యాపారులు తమవంతుగా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ రవీందర్, కౌన్సిలర్లు మాధవి, సోమ్లానాయక్, నాయ కులు దేవేందర్‌యాదవ్, గోపాల్‌గౌడ్, రామకృష్ణ, శ్రీశైలం, నందు, శ్రీను, యాదయ్య, కృష్ణ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై పలువురు నాయకులు పేర్కొన్నారు. సంఘ సంస్కర్త, భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామాలు, పట్టణాల్లో గల ఖాళీ స్థలాలు, రోడ్లవెంబడి మొక్కలు నాటారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా, రాష్ట్ర, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



షాద్‌నగర్‌రూరల్: మొక్కలు నాటుతున్న నాయకులు



కొత్తూరు: పట్టణంలో మొక్కలు నాటుతున్న నాయకులు



మొయినాబాద్‌రూరల్: బాకారంలో మొక్కలు నాటుతున్న నాయకులు



శంకర్‌పల్లి: మీర్జాగూడలో మొక్కలు నాటుతున్న నాయకులు

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

ఇన్‌స్పెక్టర్ ప్రసాద్

నందిగామ: విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ అన్నారు. మండల కేంద్రమైన నందిగామలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం నందిగామ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో డ్రగ్స్ వద్దు.. జీవితం ముద్దు.. అనే అంశంపై మత్తు పదార్థాలతో జరిగే అనర్థాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇన్‌స్పెక్టర్ హాజరై మాట్లాడుతూ.. ఒక క్షణం మత్తు జీవితాన్ని నాశనం చేస్తుందన్నారు. విద్యార్థులు, యువత ఎట్టి పరిస్థితుల్లో మత్తుకు బానిసలుగా మారొద్దని సూచించారు. మత్తు అనేది జీవితాన్ని నాశనం చేయడంతో పాటు కుటుంబాన్ని చిన్నాభిన్నం చేస్తుందన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎస్‌ఐ దేవరాజ్, హెచ్‌ఎం సుధాకర్, విద్యార్థులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నందిగామ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న పోలీసులు, విద్యార్థులు

కొత్తూరులో..

కొత్తూరు: విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సీఐ నర్సింహారావు సూచించారు. సోమవారం పట్టణంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో డ్రగ్స్‌తో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి సీఐ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అంగూర్‌నాయక్, ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

షాబాద్: ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని షాబాద్ ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని వెంకమ్మగూడ ప్రాథమిక పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సింహాద్రినాయుడు, పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి కృష్ణ, అంజయ్య, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

పతాంజలి యోగ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు శశిధర్

షాద్‌నగర్‌రూరల్: ప్రతిరోజు యోగ సాధన చేయడంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పతంజలి యోగ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పానుగంటి శశిధర్ అన్నారు. శశిధర్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని సీఎస్‌కే విల్లాస్‌లో నూతనంగా యోగా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ప్రతి రోజు యోగా సాధన చేయాలని సూచించారు. యోగా సాధనతో శాశ్వత నివారణలేని అనేక వ్యాధులను నయం చేసుకోవచ్చన్నారు. అనంతరం పానుగంటి శశిధర్‌ను కాలనీవాసులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బంటారం మహేశ్‌గౌడ్, కాలనీవాసులు హరిభూషణ్, బాలకృష్ణ, దిడ్డిగోపాల్, ఇంజమూరి గోపాల్, డాక్టర్ శివానంద్, అరుణ, డాక్టర్ రాథోడ్, యోగ గురువులు రాంచంద్రయ్య, గవ్వయ్య, రామయ్య తదితరులు పాల్గొన్నారు.